జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 28 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 10

## మారెళ్లపాడు ఎత్తిపోతల ప్రారంభించనున్న రాష్ట్ర మంత్రులు


- ఈ నెల 29న భద్రాద్రి జిల్లా పర్యటనకు రానున్న రాష్ట్ర మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి
- హెలిపాడ్,ఎత్తి పోతల పథకం కెనాల్, సభా స్థలాన్నీ పరిశీలించిన
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 27 ,(ప్రజా జ్యోతి)** అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు ఎత్తి పోతల పథకం ఈనెల 29న రాష్ట్ర మంత్రులు ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు భారీ, మధ్యతరహా

మిగతా 2 లో...

## తెలంగాణ రాష్ట్రంలోని భూభారతి, 22-ఏ, రీసర్వే చేపట్టాలి




- ఎస్ ఆర్ ఓ లో వచ్చిన ఫిర్యాదులను ఏ రోజు కా రోజు చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్

**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 27,(ప్రజాజ్యోతి)** తెలంగాణ రాష్ట్రంలోని భూభారతి, 22-ఏ, సమగ్ర రీసర్వే చేసేందుకు నిర్దేశించిన అంశాల పై గురువారం రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్ష నిర్వహించారు, ఈ సందర్భంగా లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఉద్దేశించి మాట్లాడుతూ భూభారతి డాటా ఆధారంగా ఎక్కడైనా 22ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ,వ్యవసాయేతర భూముల్లో 22ఏ కింద నమోదు అయినట్లు ఉంటే వాటిని గుర్తించి నిర్ణీత ప్రొఫార్మాలో మండల తాహాసిల్దార్ ల నుంచి సేకరించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం అమలు చేయాలని తెలియజేశారు. ఎస్. ఆర్. ఓ లో వచ్చిన ఫిర్యాదులను ఏరోజుకారోజు

మిగతా 2 లో...

- గురువారం నాటి 'క్యాంప్ ఆఫీస్' సమీక్షతో బహిర్గతమైన రాజకీయ ఆధిపత్యం!
- సచివాలయం, కలెక్టరేట్‌ను వదిలేసి ఎమ్మెల్యే ముంగిట ప్రత్యక్షమైన సింగరేణి ఉన్నతాధికారులు!
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ హుకుంకు తలొగ్గిన డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్!
- మైన్స్ యాక్ట్, చట్టబద్ధ ప్రొటోకాల్‌ను పక్కనబెట్టి తీవ్రస్థాయిలో ఆత్మసమర్పణ!
- వేల కోట్ల బడ్జెట్, కార్మికుల భద్రతను శాసించే దిగ్గజ సంస్థ స్వయంప్రతిపత్తికే ముప్పు!
- ప్రభుత్వ రంగ సంస్థను తమ సొంత పరిధిగా మార్చుకుంటున్న రాజకీయ నాయకులు!



# మక్కాన్ సింగ్ 'రాజకీయ దర్పం'..

### మోకరిల్లిన సింగరేణి దిగ్గజాలు!

2 లో..

- ముసుగు వీడిన 'బడా మనుషుల' బినామీ ముఖాలు..
- సమాజంలో గౌరవం, వెనుక కోట్ల దందా!
- సేల్ డీడ్ లేకున్నా 'అబ్సల్యూట్ ఓనర్' అవతారం..
- 11,173 గజాల స్థలంపై కొత్త పల్లి కుటుంబం పట్టు!
- కిన్నెరలో ఆరుగురు.. నలుగురు రూట్‌వెల్‌లోకి..
- ఒకే కుటుంబం చేతుల్లో పారిశ్రామిక సామ్రాజ్యం!
- ఈఓటీ పెనాల్టీ రూ. 2.5–3 కోట్లు.. బ్యాంకు రుణం రూ. 3.75 కోట్లు.. భూమి విలువ మరో రూ. 17 కోట్లు!
- సభ్య సమాజంలో పెద్ద మనుషుల అవతారాలపై సమగ్ర విచారణకు డిమాండ్!

## రూ. 100 బాండ్‌తో..
# రూ. 23 కోట్ల స్కామ్‌కు స్కెచ్!

సమాజంలో హోదా, తెల్ల చొక్కాలు, పెద్ద మనుషుల ముసుగులు వేసుకుని చలామణి అవుతున్న 'బడా బాబుల' అసలు స్వరూపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. పైకి గౌరవనీయ పారిశ్రామికవేత్తలమని చెప్పుకుంటూనే, వెనుక ప్రభుత్వ సొత్తును అక్రమ మార్గాల్లో స్వాహా చేసేందుకు పక్కా వ్యూహం రచించారు. కొత్తగూడెం పారిశ్రామిక వాడలోని ప్లాట్ నంబర్ 17 (11,173 చదరపు గజాలు) లో వీరు ఆడిన బినామీ నాటకం.. కేవలం వంద రూపాయల బాండ్ పేపర్‌తో మొదలై ఏకంగా రూ. 23 కోట్లకువరకు దిగమింగే దిగ్భ్రాంతికర దోపిడీగా మారింది. ● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి




10 లో..

## నాటి బలరాం చొరవ..
# నేటి పూసపల్లికి బాట



- మాజీ సీఎండీ ఎన్. బలరాం కృషితో పూసపల్లి ఓపెన్‌కాస్ట్‌కు మార్గం సుగమం
- ఇల్లందు ఏరియాకు పూర్వ వైభవం వచ్చే అవకాశం
- ఆనాటి అతని ప్రత్యేక చొరవతో అనుమతుల ప్రక్రియకు ఊపిరి
- త్వరలో పూసపల్లి ఓపెన్‌కాస్ట్‌కు అధికారిక శంకుస్థాపన

మిగతా 2 లో...

## నాటి బలరాం చొరవ.. నేటి పూసపల్లికి బాట



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్ట్ 27, ప్రజాజ్యోతి :** ఇల్లందు ఏరియా భవిష్యత్తుపై ఆందోళన నెలకొన్న సమయంలో పూసపల్లి ఓపెన్‌కాస్ట్ గనికి మార్గం సుగమం కావడం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతుల సాధనలో మాజీ సింగరేణి సీఎండీ ఎన్. బలరాం, ఐఆర్ఎస్ కీలకంగా వ్యవహరించారు. తన పదవీకాలంలో పూసపల్లి ప్రాంతంలో పలుమార్లు పర్యటించిన బలరాం, ప్రాజెక్టుకు అవసరమైన అనుమతుల కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రాజెక్టు పురోగతిని స్వయంగా పరిశీలిస్తూ, అనుమతుల ప్రక్రియలో ఎదురవుతున్న అంశాలను పరిష్కరించేందుకు అధికారులతో సమన్వయం చేయడం ద్వారా బలరాం చొరవ చూపారు. ఆయన పదవీకాలంలో తీసుకున్న ఈ చర్యలు ప్రస్తుతం పూసపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రారంభానికి మార్గం సుగమం చేశాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పూసపల్లి ఓపెన్‌కాస్ట్‌కు అవసరమైన అనుమతులు లభించడంతో త్వరలోనే శంకుస్థాపన జరిగే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు ప్రారంభమైతే ఇల్లందు ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక వ్యాపారాలు, రవాణా, ఇతర అనుబంధ రంగాలకు ఊతం లభించే అవకాశం ఉంది. ఇప్పటికే సింగరేణి కార్యకలాపాలపై ఆధారపడి ఉన్న ఇల్లందు ప్రాంతానికి పూసపల్లి ఓపెన్‌కాస్ట్ కీలకంగా మారనుంది. ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ఇల్లందు ఏరియాకు పూర్వ వైభవం తిరిగి వచ్చే అవకాశం ఉందన్న ఆశలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పూసపల్లి ఓపెన్‌కాస్ట్‌కు అనుమతుల సాధనలో బలరాం చూపిన ప్రత్యేక చొరవ.. నేడు ప్రాజెక్టు ప్రారంభానికి మార్గం సుగమం చేయడంలో కీలకంగా మారిందనే చర్చ కార్మిక వాడలో సాగుతోంది.

## మారెళ్లపాడు ఎత్తిపోతల ప్రారంభించనున్న రాష్ట్ర మంత్రులు

(మొదటి పేజీ తరువాయి...)



నీటిపారుదల శాఖ మంత్రి నలమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవ సాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సీతారామా ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన మారెళ్ల పాడు ఎత్తిపోతల పథకం పనులను కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తో కలిసి గురువారం పనులను పరిశీలించారు. ముందుగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు భద్రాద్రి జిల్లా చేరుకునే అశ్వాపురం మండలంలోని బీ.జీ కొత్తూరు ప్రాంతంలోని హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అదే విధంగా మంత్రులు ప్రారంభించనున్న సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువల పనుల్లో మారెళ్లపాడు ఎత్తి పోతల పథకం కెనాల్, గొందిగూడెం – జీ.కొత్తూరు పల్లె ప్రకృతి ముందు గల ప్రాంతంలోని సభా స్థలాన్నీ పరిశీలించారు. ఈ క్రమంలో అక్కడ కొనసాగుతున్న పనులను త్వరితగదిన పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. పథకం ప్రారంభోత్సవ సందర్భంగా పనులతీరు, మంత్రుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. .సీతారామ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట నీటిపారుదల శాఖ సీ ఈ శ్రీనివాస్ రెడ్డి, ఈ.ఈ వెంకటేశ్వరరావు, డీ.ఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలోని భూభారతి, 22-ఏ, రీసర్వే చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో సమగ్రంగా భూ రీసర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వాటి సత్ఫలితాలు ఆధారంగా అన్ని గ్రామాల్లో రీ–సర్వే చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ అంకిత్ తో పాటు , జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● గురువారం నాటి 'క్యాంప్ ఆఫీస్' సమీక్షతో బహిర్గతమైన రాజకీయ ఆధిపత్యం! ● సచివాలయం, కలెక్టరేట్‌ను వదిలేసి ఎమ్మెల్యే ముంగిట ప్రత్యక్షమైన సింగరేణి ఉన్నతాధికారులు! ● రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ హుకుంకు తలొగ్గిన డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్! ● మైన్స్ యాక్ట్, చట్టబద్ధ ప్రొటోకాల్‌ను పక్కనబెట్టి తీవ్రస్థాయిలో ఆత్మసమర్పణ! ● వేల కోట్ల బడ్జెట్, కార్మికుల భద్రతను శాసించే దిగ్గజ సంస్థ స్వయంప్రతిపత్తికే ముప్పు! ● ప్రభుత్వ రంగ సంస్థను తమ సొంత పరిధిగా మార్చుకుంటున్న రాజకీయ నాయకులు!



# మక్కాన్ సింగ్ 'రాజకీయ దర్పం'..

## మోకరిల్లిన సింగరేణి దిగ్గజాలు!

**భద్రాద్రి కొత్తగూడెం \ సింగరేణి ప్రతినిధి, ఆగస్ట్ 27, ప్రజాజ్యోతి :** రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ఎస్‌సిఎల్) పై రాజకీయ ఆధిపత్యం నానాటికీ హద్దులు దాటుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ప్రజాప్రతినిధి తన అధికార పరిధిని, పరిమితులను దాటి ఒక ప్రభుత్వ రంగానికి చెందిన ఉన్నతాధికారులపై తన రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడమే కాకుండా, వారిచేత తలొగ్గేలా చేయడం ఇప్పుడు తీవ్ర వివాదాస్పదమవుతోంది. గురువారం నాడు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తన సొంత క్యాంప్ కార్యాలయానికి సింగరేణి ఉన్నతాధికారులను పిలిపించుకుని ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించడం దీనికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. ఒక పక్క కంపెనీల నిబంధనావళి, మైన్స్ యాక్ట్ ప్రకారం స్పష్టమైన స్వయంప్రతిపత్తి ఉన్న సంస్థను, మరోపక్క వేల కోట్ల రూపాయల బడ్జెట్‌ను పర్యవేక్షించే బోర్డు స్థాయి అధికారులను రాజకీయ నాయకుడి గడప తొక్కి సమీక్షలకు హాజరయ్యేలా చేయడం రాజకీయ దర్పానికి ప్రత్యక్ష సాక్ష్యంగా మారింది.

**మక్కాన్ సింగ్ 'రాజకీయ దర్పం'..**

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ తన రాజకీయ ప్రాభవాన్ని, ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ సింగరేణిని సొంత పరిధిగా మార్చుకునే ప్రయత్నం చేస్తుంటే.. సంస్థ గౌరవాన్ని నిలబెట్టాల్సిన అధికారులే ఆ రాజకీయ ఆధిపత్యానికి పూర్తిగా లొంగిపోవడం గమనార్హం. గురువారం జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే పిలుపునకు తలొగ్గి సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణతో పాటు ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్ వంటి ఉన్నతాధికారులు క్యాంప్ ఆఫీసుకు వెళ్లి మోకరిల్లడం సంస్థ స్వయంప్రతిపత్తిని తీవ్రంగా పాతరేసింది. దీంతో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్ అధికార యంత్రాంగంపై, ప్రభుత్వ రంగ సంస్థలపై తన రాజకీయ పెత్తనాన్ని చెలాయించేలా వ్యవహరించడం పాలనాపరంగా తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కలెక్టరేట్, సచివాలయం లేదా సింగరేణి అధికారిక ప్రాంగణాల వంటి తటస్థ వేదికలను పక్కనపెట్టి, నేరుగా గురువారం నాడు తన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికే ఉన్నతాధికారులను పిలిపించుకుని సమీక్షల పేరుతో హుకుం జారీ చేయడం రాజకీయ ఆధిపత్యానికి పరాకాష్ట గా మారింది . ప్రభుత్వ రంగ సంస్థల స్వతంత్రతను, నిర్ణయాధికారాలను తన రాజకీయ దర్పం ముందు తక్కువ చేసి చూపించే ఈ సంస్కృతి వల్ల అటు సింగరేణి, ఇటు కాంగ్రెస్ ప్రభుత్వ ఉనికికే ముప్పు తెచ్చేలా ఉంది.

### క్యాంప్ ఆఫీస్ సమీక్షతో సంస్థాగత స్వయంప్రతిపత్తి బలి!

**గురువారం నాడు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్ తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష, దానికి పూర్తిగా తలొగ్గిన డైరెక్టర్ ఎల్.వి. సూర్యనారాయణ, జీఎం లలిత్ కుమార్, ఆర్. అర్జున్ ల తీరు సింగరేణిని ఒక రాజకీయ అడ్డాగా మార్చేసింది. ప్రజాప్రతినిధి తన రాజకీయ ప్రాభవాన్ని చాటుకోవడానికి, అధికారులు తమ హోదాను విస్మరించి లొంగిపోవడానికి సింగరేణి వేదిక కావడం అత్యంత విచారకరం. ప్రొటోకాల్ ను, మైన్స్ యాక్ట్ నియమాలను కాలరాస్తూ జరుగుతున్న ఈ రాజకీయ ఆధిపత్య పోరును వెంటనే అరికట్టకపోతే, దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థ తన స్వతంత్రతను శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉంది.**

**మోకరిల్లిన సింగరేణి దిగ్గజాలు!**

మరోవైపు, ఎమ్మెల్యే రాజకీయ ఆధిపత్య ధోరణికి తలొగ్గి, తమ చట్టబద్ధమైన హోదాను తాకట్టు పెట్టిన డైరెక్టర్ ఎల్.వి. సూర్యనారాయణ, జీఎం లలిత్ కుమార్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. వేల కోట్ల బడ్జెట్, వేలాది మంది కార్మికుల జీవితాలు, ఉత్పత్తి లక్ష్యాలను పర్యవేక్షించే కంపెనీ బోర్డు సభ్యుడైన డైరెక్టర్ స్థాయి అధికారి గురువారం నాటి పిలుపునకు స్పందించి రాజకీయ నాయకుడి క్యాంప్ ఆఫీస్ మెట్లు ఎక్కి ఆధిపత్యాన్ని అంగీకరించడం సింగరేణి చరిత్రలోనే క్షమించరాని పరిణామం. ప్రొటోకాల్‌ను, సంస్థాగత నియమావళిని నడిబొడ్డున పక్కన పెట్టి రాజకీయ నాయకుడి ముంగిట ఆత్మసమర్పణ చేసుకోవడం అధికారుల హోదాకే మచ్చతెచ్చింది. రాజకీయ నాయకులు తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి ప్రభుత్వ రంగ సంస్థలను వేదికలుగా మార్చుకోవడం, దానికి అధికారులే ప్రత్యక్షంగా సహకరించడం ఇది ఇలాగే కొనసాగితే 1 3 7 ఏళ్ళ సింగరేణి చరిత్ర ఉనికి పూర్తిగా దెబ్బతింటుంది. ఇలా ప్రజాప్రతినిధులు రాజకీయ పెత్తనం మితిమీరితే.. దానికి అధికారులు మోకరిల్లితే సిరుల మాగణి సంస్థాగత నిర్ణయాధికారాలు, ప్రొటోకాల్ ప్రమాణాలు కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదముంది.

# ప్రేమానురాగాల ప్రతీక... రక్షాబంధన్...!

- అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్ల ఆత్మీయ బంధ(న) ం...
- దూర ప్రాంతాల నుంచి వచ్చి మరీ రాఖీలు కట్టడం సంప్రదాయం
- నేడే రాఖీ పౌర్ణమి





ఇల్లందు, ఆగస్ట్ 27 (ప్రజా జ్యోతి) మానవీయ సంబంధాలను పటిష్టం చేస్తూ సోదర ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్ సంప్రదాయబద్ధమైన మానవ విలువలను మరింత ఉట్టిపడేలా చేస్తుంది. ఉన్మాదత్వం విచక్షణ వంటి వెకిలి చేష్టలు పెట్రేగి మానవతా విలువలు మంట కల్పిస్తున్న ప్రస్తుత ఆధునిక యుగంలో రాఖీ పౌర్ణమి తన విశిష్టతను చాటి చెబుతూ సోదర ప్రేమ పటిష్టతకు దోహదపడుతుంది. సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. రాఖీ పండుగను పురస్కరించుకొని ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం... అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగకు సర్వం సిద్ధమైంది. నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది. సోదరసోదరీమణుల మధ్య ప్రేమానురాగాలను మరింత బలపరిచే ఈ పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోనున్నారు. కేవలం అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ళకి రక్షాబంధన్ పరిమితం కాదు. స్నేహానికి కూడా ప్రతీకగా నిలుస్తుంది. విలువ లతో కూడినప్రేమను ఆస్వాదించేవారు ఎవరైనా రాఖీ వేడుకల్లో సంబరంగా పాల్గొంటారు. ఆడపడుచులు తమ మెట్టింటి నుంచి పుట్టింటికి వచ్చి సోదరుల ముంజేతికి రక్షా కడతారు. అన్నా, చెల్లెళ్ళ మధ్య అనురాగానికి ప్రతీకగా కాకుండా సమాజంలో మానవ బంధా లను పెంచడంలోనూ రాఖీ పండుగ దోహదపడుతుందనే చెప్పొచ్చు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో వచ్చే రాఖీ పర్వదిన్నాన్ని కులమతాలకు అతీతంగా మన రాష్ట్రంతో పాటు దేశవ్యా ప్తంగా జరుపుకుంటారు. శ్రావణమాసంలో వచ్చే పండుగ కాబట్టి ఇశ్రావణ పౌర్ణమి అని మరి కొందరు, మరికొందరు రాఖీ పౌర్ణమి అని పిలుస్తారు. కేరళ, తమిళ నాడు, ఒడిసా రాష్ట్రాలలో అవని అని, బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గడ్ లో కమ్మరిపూర్ణముగా రక్షాబంధన్ జరుపుకుంటారు. గోవా, కర్ణాటక, మహారాష్ట్రలలో ఈ పండుగ అనే కొత్త రుతువు ప్రారంభమైనట్లు అక్కడి ప్రజలు భావిస్తారు. రాఖీ పండుగ వెనుక ఎన్నో పురాణ కథలు ఉన్నాయి. ఇప్పుడు రాఖీలు అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్లు కట్టుకుంటున్నారు. కానీ తొలుతరాఖీని భార్య తన భర్తకు కట్టిందని పురాణాలు చెబుతున్నాయి. రాక్షసులు, దేవతలకు మధ్య భీకర పోరు జరి గింది. ఈ పోరులో రాక్షసుల పరాక్ర మాన్ని చూసి వన రాజ్యాన్ని కోల్పోతామేమోనని దేవతల రాజు దేవేంద్రుడు భయాందోళనలకు గురై యుద్ధానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయాడు. తనభర్త విజయం సాధించాలని భార్య సూచి దేవి ఇంద్రుడిని పూజించిన ఒక దారాన్ని చేతికి కడుతుంది. దీనితో ఇంద్రుడు విజయం సాధిస్తాడు. ఇలా రాఖీ పౌర్ణమి గురించి అనేక కథనాలున్నాయి. మానవసంబంధాలను గాలికి వదిలేసిన ప్రస్తుత తరుణంలో మన దేశంతో పాటు బ్రిటన్, కెనడా, నేపాల్లో కూడా ఘనంగా జరుపుకుంటారు. రాఖీ పండగ వచ్చిందంటే ఇల్లంతా సందడిగా ఉంటుంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్ని వయసుల వారు ఘనంగా జరుపుకుంటారు. ప్రతి ఇంట్లో రాఖీ పండుగ సంతోషంగా జరుపుకోవాలని ఆశిద్దాం.

**దూర ప్రాంతాల నుంచి పుట్టింటికి...**

ఉద్యోగాలు, చదువులు, వివాహం తదితర కారణాలతో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న అక్కాచెల్లెళ్లు, రాఖీ పౌర్ణమి సందర్భంగా పుట్టింటికి చేరుకుంటున్నారు. కొందరు దూర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ప్రయాణించి వచ్చి తమ సోదరులకు రాఖీ కట్టి ఆశీర్వాదాలు అందుకుంటారు. సోదరులు కూడా తమ అక్కాచెల్లెళ్లకు కానుకలు అందించి వారి పట్ల తమ ప్రేమను చాటుకుంటారు.

**రాఖీ కడితే రక్షణకు భరోసా...**

సోదరి తన సోదరుడి మణికట్టుకు రాఖీ కట్టి, అతడు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకోవడం ఈ పండుగలో ప్రధాన సంప్రదాయం. సోదరుడు కూడా తన సోదరికి జీవితాంతం అండగా ఉంటానని, కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తాననే భరోసా ఇస్తాడు. దీంతో రాఖీ పండుగ కేవలం ఒక ఆచారంగా కాకుండా ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుంది.

**మార్కెట్లలో రాఖీల సందడి....**

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని మార్కెట్లలో వివిధ రకాల రాఖీలు, చాక్లెట్లు, స్వీట్లు, బహుమతులు అందుబాటులోకి వచ్చాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు తమ సోదరుల కోసం రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. రంగురంగుల రాఖీలు, ప్రత్యేక డిజైన్లతో కూడిన రాఖీలు ఆకట్టుకుంటున్నాయి.

**కుటుంబ సభ్యులంతా ఒక్కచోట...**

రాఖీ పండుగ నేపథ్యంలో చాలాకాలం తర్వాత కుటుంబ సభ్యులు ఒక్కచోట చేరడంతో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంటుంది. సోదరసోదరీమణులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడపనున్నారు. పండుగ సందర్భంగా ఇళ్లలో ప్రత్యేక వంటకాలు తయారు చేసి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడం ఆనవాయితీగా వస్తుంది.

**తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం....**

కాలం మారుతున్నా రాఖీ పౌర్ణమి సందర్భంగా పాటించే సంప్రదాయాలకు మాత్రం ఆదరణ తగ్గడం లేదు. ఆధునిక జీవనశైలిలో కుటుంబ సభ్యులు దూరంగా ఉంటున్నప్పటికీ, ఈ ఒక్కరోజు సోదరసోదరీమణులు పరస్పరం కలుసుకుని తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ప్రేమ, ఆప్యాయత, అనురాగం, పరస్పర నమ్మకాలకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుంది.

**ఆనందంగా జరుపుకోనున్న సోదర సోదరీమణులు....**

నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆయురారోగ్యాలను కోరుకోనున్నారు. సోదరులు కూడా తమ అక్కాచెల్లెళ్లకు కానుకలు అందించి సంతోషాన్ని పంచుకోనున్నారు. దీంతో పట్టణం, గ్రామాల్లో రాఖీ పండుగ సందడి కనిపించనుంది. రాఖీ... ఒక దారం కాదు...అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల మధ్య విడదీయలేని ప్రేమానుబంధానికి ప్రతీక.

## వృక్ష రక్షా బంధన్ నిర్వహించిన ఎర్ర గుంట పాఠశాల విద్యార్థులు

- చెట్లకు రాఖీలు కట్టి పర్యావరణ పరిరక్షణపై అవగాహన
- చెట్లను సోదరులుగా భావించి రక్షణకు ప్రతిజ్ఞ



అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 27 (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ఉపాధ్యాయులతో కలిసి వృక్ష రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఎకో క్లబ్, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోని రావి చెట్టుకు ఆకులు, పువ్వులతో తయారు చేసిన రాఖీని కట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రాఖీ పండుగ సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. అదే స్ఫూర్తితో చెట్లను కూడా సోదరులుగా భావించి వాటి రక్షణ బాధ్యతను గుర్తు చేసేందుకు ప్రతి సంవత్సరం పాఠశాలలో వృక్ష రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెట్లు కలకాలం పచ్చగా ఉండి మానవాళికి స్వచ్ఛమైన గాలి, నీడతో పాటు అనేక విధాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి సునంద రెడ్డి, ఎకో క్లబ్ ఇన్‌చార్జి మోత్కూరి పద్మ, ఉపాధ్యాయులు బాబురావు, వెంకటేశ్వరరావు, వసంత, మోతీలాల్, జయరాం, ప్రసాద్, పాఠశాల కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, శిరీష, ఖాసీం, ఎకో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ అన్నపురెడ్డిపల్లి మండల ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో గంజాయి సరఫరా పై ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్



కొత్తగూడెం కలెక్టరేట్ , ఆగస్టు 27, (ప్రజా జ్యోతి) జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణు గోపాల్ అధికారులను గురువారం ఆదేశించారు. ఐడీఓసీ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తుల జీవితాలుదుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువత, కార్మికులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో గంజాయి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అన్నారు. సంబంధిత శాఖలన్నీ ప్రణాళికబద్ధంగా సమన్వయంతో పనిచేస్తూ నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గత సమావేశం నుండి ప్రస్తుత సమావేశం వరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఆర్టీసీ ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆర్టీసీ కండక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి

- ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలి
- కాలసాని సంజయ్ రెడ్డి

పినపాక, ఆగష్టు 27(ప్రజాజ్యోతి) దేశ, రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ కార్యదర్శి కాలసాని సంజయ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్‌రోడ్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా సంజయ్ రెడ్డి మాట్లాడుతూ యువత రాజకీయాలపై అవగాహన పెంచుకుని, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు రావాలని సూచించారు. రాజకీయాల్లో యువతకు మరింత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు నాయకత్వ అవకాశాలుకాంగ్రెస్ పార్టీ యువతను ప్రోత్సహిస్తూ నాయకత్వ అవకాశాలు కల్పిస్తోందని ఆయన తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంలో యువత ముందుండాలని కోరారు. గ్రామస్థాయి నుంచే పార్టీ బలోపేతంకాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ విధానాలను గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువజన కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో యువతను మరింతగా భాగస్వామ్యం చేస్తామని, అంకితభావంతో పని చేసే యువ నాయకులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. యువతను రాజకీయంగా చైతన్యవంతులను చేసి, గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని నాయకులు పేర్కొన్నారు. కాలసాని సంజయ్ రెడ్డికి ఘన సన్మానంఅనంతరం పినపాక మండల కాంగ్రెస్ అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు కాలసాని సంజయ్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామనాథం, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడ రమేష్, దిశా కమిటీ మండల అధ్యక్షులు మద్దెల సమ్మయ్య, ఉప్పాక ఉపసర్పంచ్ రామ్మోహన్, కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, చిట్టిమల్ల సతీష్‌చారి, కొండేరు సంపత్ తదితరులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



# ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

- ధర్నా చౌక్ లో 'టీజీఈ జేఏసీ' మహాధర్నా
- జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి కి వినతి పత్రం అందజేసిన జేఏసీ నాయకులు



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 27, (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు , పెన్షనర్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ధర్నా చౌక్ వద్ద సోమవారం "మహాధర్నా" నిర్వహించారు ,ఈ కార్యక్రమానికి వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ విధులకు సెలవు పెట్టి స్వచ్ఛందంగా పాల్గొన్నారు, మహాధర్నాను ఉద్దేశించి టి జి ఈ జేఏసీ జిల్లా చైర్మన్ అమరనేని రామారావు ,కన్వీనర్ సంగం వెంకట పుల్లయ్య లు మాట్లాడుతూ నేడు జరుగుతున్న ధర్నాకు హాజరైన ఉద్యోగ ప్రభంజనాన్ని చూస్తుంటే ప్రభుత్వంపై ఉద్యోగుల తిరుగుబాటు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ వర్గాలు నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నాయని, కానీ వారి ఆర్థిక, సేవా, ఆరోగ్య భద్రతను నిర్లక్ష్యం చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు టీజీఈ జేఏసీ తరఫున ప్రభుత్వం ముందు ఉంచిన ప్రధాన డిమాండ్లను తెలియజేస్తూ మొదటిగా 2వ వేతన సవరణ కమిషన్ నుండి నివేదికను తెప్పించుకొని తక్షణమే అమలు చేయాలన్నారు, ఉద్యోగులు, పెన్షనర్లకు రావలసిన 6 డి ఎ (కరువుభత్యాలను) వెంటనే విడుదల చేయాలన్నారు, నెలకు 2,000 కోట్ల చొప్పున పేరుకుపోయిన సుమారు 10,000 కోట్ల ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు / బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని, అదేవిధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనీ, నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను నగదు రహిత ప్రాతిపదికన సక్రమంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు, అనంతరం, ధర్నా చౌక్ నుండి భారీ నిరసన ర్యాలీగా వెళ్ళి, తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కి, తెలంగాణ ప్రభుత్వానికి అందజేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్కు జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో టి జి ఈ (జెఎసి) జిల్లా నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారుల సంఘాల ప్రతినిధులు, పెన్షనర్లు కార్మికుల తో పాటు టి జి ఈ జెఎసి భార్గవ్ చైతన్య,పి నర్సయ్య, ఎం వెంకటేశ్వర్లు, వెంకటరమణ,బి రవి,భగవాన్ రెడ్డి,ఎం. ఈ జి ఆర్ ప్రసాద్,టి.సుశీలా,హరిలాల్,రాములు,లక్ష్మణ్ నాయక్,వి శ్రీనివాస్, దుర్గయ్య,టి శ్రీనివాస రెడ్డి,జమలా రెడ్డి,బందు వెంకటేశ్వరావు,సతీష్ కుమార్,అజ్మీరా రామ్ రవి,అశోక్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు

## గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు





**చర్ల, ఆగస్టు 27 : (ప్రజా జ్యోతి):** సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక ఆదేశాల మేరకు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో జ్వర సర్వేలు, వైద్య శిబిరాలు నిర్వహించారు.పుసుగుప్ప, గన్నవరం కాలనీ, సబ్బంపేట, కొత్తపల్లి, కందిపాడు, మొగలపల్లి, లక్ష్మీ కాలనీ గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. హెల్త్ సూపర్వైజర్లు, ఎం ఎల్ హెచ్ పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.జ్వరం వచ్చిన వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు.జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన వైద్య సూచనలు అందించారు. జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు,ఎం ఎల్ హెచ్ పి లు ,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం

- నేత్రదానం ద్వారా మరణాంతరం అందుల వెలుగుల్లో జీవితాలు నింపొచ్చు
- డిప్యూటీ జిల్లా వైద్య శాఖ అధికారి ప్రతాప్





**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 27,(ప్రజా జ్యోతి)** 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్ ఆదేశాల మేరకు, కొత్తగూడెం డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా ప్రతాప్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సిజిహెచ్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్రదాన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు, నేత్రదానం ద్వారా మరణానంతరం అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని, సమాజంలోని ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. నేత్రదానానికి సంబంధించిన అపోహలు, వాస్తవాలు ,కార్నియా దానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు, నేత్రదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, ఎక్కువ మందిని నేత్రదానానికి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారుఈ కార్యక్రమంలో సిజిహెచ్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పీ ఎం ఓ డా. తిరుమలరావు, అగర్వాల్ ఐ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో మూడు కేజీల గంజాయి పట్టివేత

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 27 ,(ప్రజా జ్యోతి)** గుట్టు చప్పుడుగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం రాత్రి పాల్వంచ పోలీసులు పట్టుకున్నారు, వివరాలు ఎలా ఉన్నాయి,సూర్యాపేట జిల్లాకు చెందిన జోసెఫ్, శ్రీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు ఒరిస్సాలో మూడు కేజీల గంజాయిని కొనుగోలు చేసి తమ ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం వెళుతుండగా పాత పాల్వంచలోని మహాలక్ష్మి అమ్మవారి టెంపుల్ వద్ద పోలీసులు పట్టుకొని విచారణ అనంతరం స్టేషన్కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా ప్రారంభమైన జాబ్ మేళా

- యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు





**చర్ల, ఆగస్టు 27(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన జాబ్ మేళా ఘనంగా ప్రారంభమైంది. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాల–చర్లలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో, లైన్స్ క్లబ్ కేరళ వారి సౌజన్యంతో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ , టాటా స్టైవ్ సంస్థల సహకారంతో ఈ జాబ్ మేళాను నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలనతో జాబ్ మేళాను ప్రారంభించారు. అనంతరం ఉద్యోగాల కోసం వచ్చిన యువతతో మాట్లాడి, వారికి అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలు, శిక్షణా కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ చర్ల మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా లభించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు జాబ్ మేళాలు మంచి వేదికగా నిలుస్తాయని, ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.టూరిజం, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందేందుకు యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుని తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. జాబ్ మేళాకు చర్ల మండలం, పరిసర ప్రాంతాల నుంచి పలువురు నిరుద్యోగ యువత హాజరై వివిధ ఉద్యోగాల కోసం తమ వివరాలను నమోదు చేసుకున్నారు. సంబంధిత సంస్థల ప్రతినిధులు అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరిశీలించి ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ నరేందర్ ,చర్ల సిఐ రాజు వర్మ ,ఎస్ఐ నర్సిరెడ్డి, చర్ల పంచాయతీ ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, కళాశాల సిబ్బంది, జాబ్ మేళా నిర్వహించే నిర్వాహకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు నూతన దుస్తులు పంపిణీ



**చర్ల, ఆగస్టు 27 (ప్రజా జ్యోతి ):** వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో గిరిజన బాలికల కోసం విద్యార్థి నిలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని రైస్ పేటలోని కోట బండాలమ్మ తల్లి ఆలయ అర్చకులు పున్నమరాజు కార్తీక్ శర్మ అన్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా చర్లలోని శబరి బాలికా విద్యార్థి నిలయంలో చదువుతున్న విద్యార్థినులకు కార్తీక్ శర్మ తల్లిదండ్రులు, సాయిబాబా ఆలయ అర్చకులు విజయకుమార్ శర్మ–లలిత దంపతులు నూతన దుస్తులను అందించారు. గురువారం శబరి బాలికా నిలయ బాధ్యులు గోగికార్ రాంలక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కార్తీక్ శర్మ విద్యార్థినులకు దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్తీక్ శర్మ మాట్లాడుతూ వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో చర్లలో గిరిజన బాలుర కోసం కొమరం భీం విద్యార్థి నిలయం నిర్వహిస్తూ వారిని క్రమశిక్షణతో తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. అదే విధంగా ఈ ఏడాది నుంచి గిరిజన బాలికల కోసం శబరి పేరుతో విద్యార్థి నిలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆదివాసీల అభ్యున్నతికి వనవాసీ కళ్యాణ పరిషత్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, కొమరం భీం నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, శబరి బాలికా నిలయ కార్యదర్శి బందా స్వరూపరాణి, సుజాత, వరలక్ష్మి , సంతోష్, ముఖేష్ పాల్గొన్నారు.

# రాష్ట్ర అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో కొత్తగూడెం జిల్లాకు 20 పతకాలు




**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 27, (ప్రజాజ్యోతి)** తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హన్మకొండ, జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 26న ముగిశాయి, ఈ పోటీలలో రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మొత్తం ఇరవై పతకాలు సాధించారని, ఇందులో ఏడు బంగారు, ఆరు రజత, ఏడు కాంస్య పతకాలు గెలుచుకునరని కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ గురువారం తెలిపారు. ఇందులో భాగంగా చర్లకు చెందిన ఎం శ్రీ విద్యా ధొర 80 మీటర్ల హర్డిల్స్ పరుగుపందెంలో , లాంగ్ జంప్ లో రెండు బంగారు పతకలు గెలుపొందారనీ, కరకగూడెం కు చెం దిన శ్రీ తేజ హెప్తాతలోన్ లో బంగారు పతకం, కొత్తగూడెం కు చెందిన సిహెచ్.వేదశ్రీ షాట్ పుట్ లో బంగారు పతకం, భద్రాచలంకి చెందిన ఎస్కే.అఫ్రిన్ జావిలిన్ లో బంగారు పతకం , షాట్ పుట్ లో రజతపతకం, బి.వృద్విక జావిలిన్ లో బంగారు పతకం, పాల్వంచకు చెందిన ఆర్ అభినవ నాయక్ హై జంప్లో బంగారు పతకం, డెకతలోన్‌లో రజత పతకం, 4x100రిలేలో అభినవ్, వినయ్, విగ్నేష్, వరుణ్ లు బంగారు పతకం, సిద్ది వినయ్ హై జంప్ లో రజత పతకం , త్రిపుల్ జంప్ లో కాంస్య పథకం, పాల్వంచకు చెందిన ఎం. నాగేశ్వరి 5000 మీటర్ల పరుగుపందెంలో రజిత పథకం, బి. సౌమ్య, జావిలిన్ త్ లో రజిత పథకం,కాచన పల్లి కి చెందిన ఈ. సమీరా ట్రయతలోన్ లో కాంశ్య పతకం, దమ్మపేటకు చెందిన ఎం కావ్య హై జంప్ లో రజత పథకం, పాల్వంచకు చెందిన ఎం దివ్య లాంగ్ జంప్ లో కాంస్య పథకం కొత్తగూడెంకు చెందిన కే. ఆనంద్ కిడ్స్ జావిలిన్ లో కాంస్య పథకం, జి. కుమార, డిస్కస్ త్ లో కాంస్య పథకం, వి. పల్లవి, షాట్ పుట్ లో కాంస్య పతకం, ఎం. విగ్నేష్ 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం గెలుపొందరని తెలిపారు. అనంతరం రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. సారంగపాణి విజేతలను అథ్లెటిక్స్ కోచ్ లు పి. నాగేందర్,ఎం.నాగరాజు మల్లికార్జున్, జన్ను గిరి ప్రసాద్ లు క్రీడాకారులను అభినందించారు.1

# రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలి

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై రేగా కాంతారావు వ్యాఖ్యలను ఖండించిన గద్దల రమేష్



**మణుగూరు, అగస్ట్ 27,ప్రజాజ్యోతి :** పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చేసిన వ్యాఖ్యలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ గద్దల రమేష్ తీవ్రంగా ఖండించారు. గురువారం మణుగూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల తీర్పుతో ఎన్నికైన ప్రజాప్రతినిధిపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు.పాయం వెంకటేశ్వర్లు ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారిస్తూ ముందుకు సాగుతున్నారని గద్దల రమేష్ అన్నారు. ప్రజల్లో ఆదరణ పొందుతున్న నాయకుడిని రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని పేర్కొన్నారు.రేగా కాంతారావుపై గతంలో వచ్చిన ఆరోపణలు, వాటికి సంబంధించిన కేసు అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని గద్దల రమేష్ అన్నారు. ఆరోపణలపై సమాధానం ఇవ్వకుండా ఇతర నాయకులపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని భావిస్తే సంబంధిత అంశాలపై ప్రజలకు వాస్తవాలను వివరించాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలు సహజమేనని, అయితే విమర్శలు వ్యక్తిగత దూషణలకు దారితీయకూడదని అన్నారు. ప్రజల మద్దతుతో గెలిచిన ఎమ్మెల్యే గౌరవానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రజల మధ్య విభేదాలు, ఉద్రిక్తతలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రేగా కాంతారావుకు సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని గద్దల రమేష్ తెలిపారు. పినపాక నియోజకవర్గ ప్రజలు అన్ని రాజకీయ పరిణామాలను గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే తమ తీర్పును ఇస్తారని అన్నారు. వ్యక్తిగత విమర్శలకు స్వస్తి పలికి ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ జాడీ రాంబాబు, జిల్లా కార్యదర్శి నులుకుతాటి శ్రీను, పినపాక నియోజకవర్గ ఇన్చార్జి కొట్టె అనిల్ కుమార్, మణుగూరు టౌన్ మండల అధ్యక్షుడు పదుతూరి రవి, బర్ల శ్వేతన్, ఆళ్లపల్లి మండల అధ్యక్షుడు ఇనుముల ఇందుకుమార్, పినపాక మండల అధ్యక్షుడు చిట్టిమల్ల ప్రసాద్, గుండాల మండల అధ్యక్షుడు పుష్పరాజ్, పాల్వంచ టౌన్ అధ్యక్షుడు గోలి సదాశివ, కాకటి నరేష్, గద్దల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

- దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 27, (ప్రజా జ్యోతి)** ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి వందలాది మంది అమాయక నిరుద్యోగులకు నకిలీ నియామక పత్రాలు ఇచ్చి లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసోషల్ మీడియాలో వచ్చిన ఉద్యోగాల మోసం కథనం ఆందోళన కలిగిస్తోంద నీ అన్నారు , చెట్టు పేరు చెప్పి కాయలు కోసుకునే చందంగా ధనార్జన ధ్యేయంగా పెద్దల పేర్లు చెప్పుకొని నిరుద్యోగుల జీవితాలతో, వారి ఆశలతో ఆడుకుంటూ, నకిలీ అపాయింట్ మెంట్ ఆర్డర్లు సృష్టించి మోసానికి పాల్పడటం అత్యంత దారుణం అన్నారు.ఉద్యోగం వస్తుందనే ఆశతో అప్పులు చేసి డబ్బులు కట్టిన దళిత, గిరిజన, పేద యువకులు నేడు రోడ్డున పడుతున్నారని అన్నారు, ఇది కేవలం మోసం కాదు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న నేరమని అన్నారు,ఈ మోసం పై పోలీసు శాఖ సమగ్ర దర్యాప్తు జరిపించాలనీ ,నకిలీ పత్రాలు ఎక్కడ తయారయ్యాయి? వాటి వెనుక ఎవరున్నారు? అనే కోణంలో విచారణ చేపట్టాలన్నారు, అదేవిధంగాబాధితులు ఎంతమంది ఉన్నారు? ఎంత మొత్తం వసూలు చేశారు? అనే వివరాలు బయటపెట్టాలనీ, ఈ మోసానికి పాల్పడిన ప్రధాన నిందితులను, వారికి సహకరించిన వారిని వెంటనే అరెస్ట్ చేసి, చీటింగ్ 420, 406, 468 సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాల నీ, బాధిత నిరుద్యోగులకు వారు చెల్లించిన డబ్బులను తిరిగి ఇప్పించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు, అధికారం పేరుతో దోపిడీ చేసే ఇలాంటి మోసగాళ్లను కఠినంగా శిక్షించకపోతే, రాబోయే రోజుల్లో మరెందరో ని రుద్యోగులు మోసపోయే అవకాశం ఉందన్నారు, బాధితులకు న్యాయం జరిగే వరకు దళిత సంక్షేమ సంఘం వారి పక్షాన పోరాడుతుందని ఆయన హెచ్చరించారు.

# ఓటర్ల జాబితాపై గ్రామసభ

**బూర్గంపహాడ్,ఆగస్టు 27 (ప్రజాజ్యోతి ):** మండల పరిధిలోని ఇరవెండి గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ గుండి బాబురావు, ఉపసర్పంచ్ మహంకాళి రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓటర్ల జాబితా పరిశీలన అధికారి చంద్రయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజలకు చదివి వినిపించారు. జాబితాలో ఉన్న అదనపు పరిశీలనకు సంబంధించిన పేర్లు, అసాధారణ వివరాలు, మ్యాపింగ్ కాని కేసులను ప్రజల సమక్షంలో పరిశీలించారు. కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకోవడం, పేర్ల తొలగింపు, వివరాల సవరణలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి ఒక్కరూ తమ ఆధార్ లేదా ఇతర గుర్తింపు పత్రాలతో హాజరై ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని ఓటర్ల జాబితా పరిశీలన అధికారి చంద్రయ్య సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, బూత్ స్థాయి ఏజెంట్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి




**ఇల్లందు, ఆగస్ట్ 27 (ప్రజా జ్యోతి)** నాటిన ప్రతి మొక్కను తప్పనిసరిగా సంరక్షించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలతోనే మానవాళికి మనుగడ సాధ్యమవుతుందన్నారు. వన మహోత్సవం ద్వారా పర్యావరణ పరిరక్షణ పై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర దానియల్, మున్సిపల్ కమిషనర్ సందీప్, వైస్ చైర్మన్ పెండెం రాజు, కౌన్సిలర్లు రాధ కమల్ కోరి, గండె పద్మ, అజ్మీరా వంశీ, కొర్లపాటి శివ కిరణ్, మెరుగు కార్తీక్, కోఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, సయ్యద్ అజామ్, పట్టణ కాంగ్రెస్ భోళ్ల సూర్యం, నాయకులు దొడ్డ దానియల్, కమల్ కోరి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణకు అవకాశం

- సెప్టెంబర్ 16 వరకు దరఖాస్తుల స్వీకరణ



**చర్ల, ఆగస్టు 27 :(ప్రజా జ్యోతి):** ఓటర్ల ప్రత్యేక సమగ్ర విచారణలో భాగంగా గురువారం చర్ల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని సంతపాకలో గ్రామసభ నిర్వహించారు. మండల తహసీల్దార్ శ్రీనివాస్, చర్ల మేజర్ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర విచారణలో భాగంగా మండలవ్యాప్తంగా ఓటర్ల జాబితాపై సర్వే నిర్వహించినట్లు తెలిపారు. సర్వేలో మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించామని, వివిధ కారణాలతో సవరణలు అవసరమైన 9,133 మంది ఓటర్లకు జాబితాలో తమ వివరాలను సరిదిద్దుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. గుర్తింపు పత్రాల్లో వివరాలు తప్పుగా ఉన్నవారు, సర్వే సమయంలో అందుబాటులో లేని వారికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. నోటీసులు అందిన వెంటనే సంబంధిత గుర్తింపు పత్రాలతో అధికారులను సంప్రదించి ఓటరు జాబితాలో పేర్లు నమోదు లేదా వివరాల సవరణ చేసుకోవచ్చన్నారు. ఒక వార్డు నుంచి మరో వార్డుకు మారిన వారు ఫారం–8, ఓటరు జాబితాలో పేరు లేని వారు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను సెప్టెంబర్ 16వరకు స్వీకరిస్తామని అన్నారు . ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు మాట్లాడుతూ చర్ల పంచాయతీ పరిధిలో సుమారు 2 వేల మంది ఓటర్లు తమ వివరాలను సరిదిద్దుకునే అవకాశం ఉందన్నారు. ఓటరు జాబితాలో చిన్నచిన్న పొరపాట్లు ఉన్నవారు, పేరు లేనివారు ఫారం–6 ద్వారా, వార్డు మారిన వారు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు

**దమ్మపేట, ఆగస్టు 27(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండలం, మందలపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని దమ్మపేట పోలీసులు పట్టుకున్నారు. గురువారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో చింతలచెరువు చందు, రాఘవ, సాంబశివరావు, వీరస్వామి పేకాట ఆడుతుండగా పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి రూ.1,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు దమ్మపేట పోలీసులు తెలిపారు.

## పాల్వంచలో ఘనంగా నరిగె రమేష్ కుమారుడి వివాహ వేడుక



**పాల్వంచ, ఆగస్టు 27, ప్రజాజ్యోతి:**పాల్వంచ పట్టణ రైస్ మిల్ యజమాని నరిగె రమేష్‌కుమారుడి వివాహ మహోత్సవం పాల్వంచలోని సుగుణ గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కొత్తగూడెం–పాల్వంచ కార్పొరేషన్ మేయర్ మూడె గణేష్ హాజరై వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.అలాగే సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, 44వ డివిజన్ కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వరరావు, కార్పొరేటర్ బోయిన విజయ్ కుమార్, ఆలపాటి ప్రసాద్ తదితరులు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా నూతన దంపతులకు సుఖసంతోషాలతో కూడిన వైవాహిక జీవితం సాగాలని ఆకాంక్షిస్తూ పలువురు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ప్రముఖుల సందడితో సుగుణ గార్డెన్స్‌లో వివాహ వేడుక ఉత్సాహభరితంగా సాగింది.

## సమ్మక్క–సారక్క జాతర మహోత్సవంలో పాల్గొన్న తాటి వెంకటేశ్వర్లు



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 27 (ప్రజా జ్యోతి ):**అన్నపురెడ్డిపల్లి మండలం బుచ్చన్నగూడెం గ్రామంలో నిర్వహించిన సమ్మక్క–సారక్క జాతర మహోత్సవంలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. తాటి భద్రయ్య–శ్రీనివాసమ్మ దంపతుల ఆహ్వానం మేరకు జాతరలో పాల్గొన్న ఆయనకు గ్రామ ప్రజలు, నిర్వాహకులు ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సమ్మక్క–సారక్క అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవార్ల ఆశీస్సులతో బుచ్చన్నగూడెం గ్రామ ప్రజలు, అన్నపురెడ్డిపల్లి మండల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వీరబోయిన వెంకటేశ్వర్లు, ఇనపనూరి రాంబాబు, చల్లా రమేష్, పెద్దారపు నాగరాజు, తాటి భద్రం తదితరులతో పాటు కార్యకర్తలు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు



**పాల్వంచ, ఆగస్టు 27, ప్రజాజ్యోతి:**పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెం శ్రీ చైతన్య పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు గురువారం ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.చిన్నారులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని, తీపి తినిపించుకుంటూ అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలను చాటుకున్నారు.రక్షాబంధన్ పండుగ ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, రక్షణ భావాన్ని పెంపొందించడమే కార్యక్ర మం ముఖ్య ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తెలిపా రు.చిన్నారుల సందడి, రాఖీలతో అలంకరించుకున్న చేతులు, వారి చిరునవ్వులతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాణి, ఉపాధ్యాయులు చందన, భవాని, జనిత, భావన తో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ బాలబాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలు



**పాల్వంచ, ఆగస్టు 27, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలంలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో దివ్యాంగ బాలబాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం భవిత సెంటర్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు.ఈ విషయాన్ని మం డల విద్యాధికారి శ్రీరామ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలను ఏ సీ జి ఈ మాధవరావు ప్రారంభించారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఐ ఈ కోఆర్డినేటర్ రామారావు, మండల విద్యాధికారి శ్రీరామ మూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.దివ్యాంగ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మ విశ్వాసం, పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాం టి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ మండల దివ్యాంగ పిల్లల భవిత సెంటర్ ఉపాధ్యాయులు కనకదుర్గ, అనిత, ఫిజియోథెరపీ డాక్టర్ ప్రియాంక, స్పెషల్ ఎడ్యుకేటర్ బన్సీలాల్ తో పాటు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.

## పాల్వంచ 42వ డివిజన్‌లో సమగ్ర ఓటర్ నమూనా సవరణపై గ్రామసభ



**పాల్వంచ, ఆగస్టు 27, ప్రజాజ్యోతి:**పాల్వంచ 42వ డివిజన్‌లో తహశీల్దార్ దార ప్రసాద్ ఆధ్వర్యంలో సమగ్ర ఓటర్ నమూనా సవరణ కార్యక్రమం (ఎస్ ఐ ఆర్ – 2)లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. పాల్వంచ ఎంఆర్ఓ, బీఎల్ఏ, బీఎల్ఓల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఫారం–6, ఫారం–7, ఫారం–8 ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన వారు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి వివరాలను తొలగించేందుకు ఫారం–7, చిరునామా మార్పు లేదా ఓటరు వివరాల్లో సవరణల కోసం ఫారం–8 వినియోగంపై అవగాహన కల్పించారు.అలాగే ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాను పరిశీలించుకుని తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు, గ్రామస్తులు, అధికారులు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామసభ విజయవంతంగా నిర్వహించారు.

## గురుకులాల్లో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

- **5 నుంచి 9వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీ సీట్లు**
- **ఈనెల 29న అర్హులైన విద్యార్థులకు స్పాట్ కౌన్సెలింగ్**



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 27 (ప్రజా జ్యోతి ):** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులకు ఈనెల 29న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టీ. బాలరాజు తెలిపారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లను అర్హత కలిగిన విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.బాలికలకు పాల్వంచలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో, బాలురకు పాల్వంచ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల సీఓఈలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, చదువు ధ్రువీకరణ పత్రంతో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను వెంట తీసుకురావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## ఎస్ఐఆర్ సవరణలపై గ్రామసభల్లో విస్తృత అవగాహన



**ఆళ్ళపల్లి. ఆగస్టు27(ప్రజాజ్యోతి )** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఆళ్ళపల్లి మండలం కేంద్రం.మర్కోడు గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు ) ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభల్లో ఓటర్ల జాబితాలో పేర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులు, తప్పుల సవరణలు, అభ్యంతరాల నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఆళ్ళపల్లి గ్రామసభలో తహసీల్దార్ గడ్డం ఉమారాణి, సర్పంచ్ వాసం సుష్మిత, ఉపసర్పంచ్ సయ్యద్ ఆరిఫ్, కార్యదర్శి ఉపేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, బీఎల్ఓలు, జీపీఏలు తదితరులు పాల్గొన్నారు. మర్కోడు గ్రామసభలో డిప్యూటీ తహసీల్దార్ బాదావత్ బద్రు నాయక్, సర్పంచ్ సుతారీ రమాదేవి, ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్. సుతారీ కృష్ణ, వార్డు సభ్యులు, బీఎల్ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ సవరణలపై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి, ఓటర్ల జాబితాను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు.

## పెంట్లంలో వైభవంగా ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుక

- **అమ్మవారికి ప్రత్యేక పూజలు.. భక్తులతో సందడిగా ఆలయం**

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 27 (ప్రజా జ్యోతి ):**అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామంలోని గౌడ్‌బజార్‌లో ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. గ్రామానికి చెందిన మహిళలు బోనాలతో డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.గ్రామ ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుతూ గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. ముత్యాలమ్మ తల్లికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులతో సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో పెద్ద గౌడ్ రాచకొండ నాగేశ్వరావు, చెవుగోని సత్యనారాయణ, నర్సింగ్ కృష్ణ, రాచకొండ రామచంద్రు, మందాస్ యల్లయ్య, భూపతి నర్సిహారావు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పేదవాడి వంటగదిలో వెలుగులు నింపాల్సిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ఇప్పుడు హోటల్ కుబేరుల వంటగదిలో కాసుల వర్షం కురిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్యతరగతి ప్రజల కోసం సబ్సిడీపై ఇస్తున్న 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ను కొందరు హోటల్ యజమానులు, గ్యాస్ ఏజెన్సీల యాజమాన్యం కుమ్మక్కై బహిరంగంగా దోచేస్తున్నారు. దీనికి పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ, విజిలెన్స్ అధికారుల అలసత్వం, నిర్లక్ష్యమే పెద్దపీట వేస్తోంది. మామూలుగా ఒక సామాన్యుడు గ్యాస్ సిలిండర్ బుక్ చేస్తే 2, 3 రోజులు ఆగాల్సి వస్తోంది. స్టాక్ లేదు, లారీ రాలేదు అని ఏజెన్సీలు కథలు చెబుతున్నాయి. కానీ అదే ఏజెన్సీ నుండి అదే సిలిండర్లు రాత్రికి రాత్రే హోటళ్లకు, టిఫిన్ సెంటర్లకు, చికెన్ సెంటర్లకు, టీ బండ్లకు ఎలా వెళ్తున్నాయి? ఇదే ఇప్పుడు మణుగూరు మండల వ్యాప్తంగా ప్రజలు అడుగుతున్న ప్రశ్న.**

- డొమెస్టిక్ సిలిండర్లతో యథేచ్ఛగా వ్యాపారం
- నిద్రమత్తులో అధికార యంత్రాంగం
- లక్షల్లో అక్రమార్కులకు లాభం... ప్రజలకు మాత్రం తిప్పలు...
- తెలిసినా చూసీచూడనట్లు పౌరసరఫరాల శాఖ
- ఫుడ్ ఇన్స్పెక్టర్ల తీరుపై అనుమానాలు
- లీకేజీ అయ్యి పేలితే... బూడిదయ్యేది సామాన్యుడే... బాధ్యత ఎవరిది?

# ప్రజల గ్యాస్ తో హోటళ్ల దోపిడీ...!









**మణుగూరు, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి) :** పినపాక నియోజకవర్గ కేంద్రమైన మణుగూరు మండలంలో నిబంధనల ప్రకారం హోటల్, టీ స్టాల్, రెస్టారెంట్లు, వ్యాపార సంస్థలు 19 కిలోల కమర్షియల్ సిలిండర్ మాత్రమే వాడాలి. దీని ధర ప్రస్తుతం రూ. 2600 నుండి రూ. 2700 వరకు ఉంది. కానీ హోటల్ యజమానులు రూ. 900 లకే వచ్చే డొమెస్టిక్ సిలిండర్ ను రూ.1400, నుండి రూ. 1500 వరకు బ్లాక్ లో కొనుగోలు చేస్తున్నారు. ఏజెన్సీ వారికి రూ. 400,500 అదనంగా ముడుతుంది. హోటల్ వారికి రూ. 1200 నుండి 1300 మిగులుతుంది. మధ్యలో నష్టపోయేది మాత్రం ప్రభుత్వం, సామాన్య ప్రజలు. ఒక్క మణుగూరు పట్టణంలోనే దాదాపు 80కి పైగా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు ఉన్నాయి. ఒక్కో హోటల్ నెలకు సగటున 10 సిలిండర్లు వాడితే 800 సిలిండర్లు అక్రమంగా తరలిపోతున్నట్లే. అంటే నెలకు దాదాపు రూ. 10 నుండి 11 లక్షల అక్రమ దందా ఒక్క మణుగూరులోనే జరుగుతోంది. ఇక జిల్లా మొత్తం లెక్కేస్తే కోట్లలో ఈ మాఫియా నడుస్తోందని పలువురు మేధావులు వాపోతున్నారు.

**అధికారుల అలసత్వమే దీనికి కారణమా..?అనుమానాలు అనేకం.....**

ఈ దందా అంతా అధికారులకు తెలియదా? అంటే తెలియకపోవడం కాదు, తెలిసి కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాది కాలంలో జిల్లా వ్యాప్తంగా డొమెస్టిక్ సిలిండర్ ను వాణిజ్య అవసరాలకు వాడుతున్నప్పటికీ చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. ఒక్క హోటల్ పై కూడా జరిమానా విధించలేదు. ఇటీవల కాలంలో తూ... తూ... మంత్రాంలాగా ఒకటీ రెండు కేసులు నమోదైనప్పటికి కూడా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వలన ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది అధికారుల అలసత్వమా? లేక మామూళ్ల మత్తులో నిద్రపోతున్నారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫుడ్ ఇన్స్పెక్టర్లు హోటళ్లకు వెళ్లి తనిఖీలు చేయాలి, గ్యాస్ సిలిండర్లను పరిశీలించాలి. కానీ వారు హోటల్ ముందు నుండి వెళ్తున్నా లోపలికి వెళ్లి చూడరు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

**ప్రజల ప్రాణాలతో చెలగాటం....**

డొమెస్టిక్ సిలిండర్లను ఇరుకైన కిచెన్లలో, ఒకదానిపై ఒకటి పెట్టి వాడుతున్నారు. కమర్షియల్ సిలిండర్లకు ఉండే భద్రతా ప్రమాణాలు వీటికి పాటించడం లేదు. అంతే కాకుండా బహిరంగ ప్రదేశాలలో వీటిని వాడడం వలన గ్యాస్ లీక్ అయి ప్రమాదం జరిగితే అక్కడ పని చేసే కార్మికులు, భోజనం చేసే ప్రజలు సజీవ దహనం అయ్యే ప్రమాదం ఉంది. అప్పుడు నష్టపరిహారం ఎవరు ఇస్తారు? చనిపోయిన తర్వాత వచ్చి పరిశీలించడం కాదు, ముందే మేల్కోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ దందాపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలి. ప్రతి మండలంలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ వేసి ఆకస్మిక తనిఖీలు చేయించాలి. అక్రమంగా డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్న హోటళ్లను సీజ్ చేసి, ఏజెన్సీల లైసెన్సులు రద్దు చేయాలి. అప్పుడే పేదవాడి గ్యాస్ పేదవాడికి దక్కుతుందని పలువురు మేధావులు కోరుతున్నారు.

## యువతను విస్మరిస్తే పాలకులకు పతనం తప్పదు



**కొత్తగూడెం, ఆగస్ట్ 27, ప్రజాజ్యోతి :** యువతను నిర్లక్ష్యం చేస్తే పాలకులకు పతనం తప్పదని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లాఖాద్రి హెచ్చరించారు. గురువారం కొత్తగూడెంలోని సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిర్మాణ మహాసభ నిర్వహించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ జెండాను ఆవిష్కరించి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వలిఉల్లాఖాద్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నిరుద్యోగ సమస్య తీవ్రంగా మారిందన్నారు. ఏటా కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన పాలకులు యువతను విస్మరిస్తున్నారని విమర్శించారు. ఉపాధి కల్పనపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నానబాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు శక్తులకు అప్పగించడం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటోందన్నారు. ప్రశ్నించే యువతపై నిర్బంధాలు విధించడం సరికాదన్నారు. హక్కుల సాధనకు పోరాటాలే మార్గమని, యువత ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా మాట్లాడుతూ యువతను నిర్వీర్యం చేసే విధానాలను పాలకులు విడనాడాలని అన్నారు. ఉపాధి, ఉద్యోగ రంగాలను నిర్లక్ష్యం చేయడం వల్ల యువతలో అసహనం పెరుగుతోందన్నారు. సామాజిక మార్పు కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఏఐవైఎఫ్ నిర్మాణ బాధ్యులు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ యువత తమ పోరాట బలాన్ని పెంచుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగే ఉద్యమాలకు సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కల్లూరి వెంకటేశ్వరరావు, ఇటికల రామకృష్ణ, సలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మీకుమారి, వి.పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్.కె. ఫహీమ్, ఖయూమ్, భూపేష్, జర్పుల ఉపేందర్, అనుముల సాయి, సాధనపల్లి సతీష్, భూక్యా దస్రు, కందుల భాస్కర్, డి.శంకర్, భూక్యా శ్రీనివాస్, గోపికృష్ణ, ధర్మరాజు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, యూసుఫ్, సత్యనారాయణ, ఎర్రబెల్లి శంకర్, చాంద్ పాషా, బోయిన విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ వేడుకలకు రంగం సిద్ధం

- సోదరసోదరీమణుల ప్రేమానుబంధానికి ప్రతీకగా పండుగ సందడి



**అశ్వాపురం, అగస్ట్ 27,ప్రజాజ్యోతి:** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలను చాటిచెప్పే రాఖీ పండుగకు అశ్వాపురం మండల కేంద్రంలో సందడి మొదలైంది. రేపు శుక్రవారం రాఖీ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ప్రధాన మార్కెట్ ప్రాంతాలు, దుకాణాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. వివిధ ఆకృతులు, రంగులతో కూడిన రాఖీలు, మిఠాయిలు, బహుమతి వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.రాఖీ పండుగ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను కోరుకుంటారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు కానుకలు అందిస్తూ జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇస్తారు. దీంతో ఈ పండుగ కుటుంబ సభ్యుల మధ్య ప్రేమను, ఆత్మీయతను మరింత పెంచే వేడుకగా కొనసాగుతోంది.పండుగ నేపథ్యంలో అశ్వాపురంలోని రాఖీ దుకాణాల్లో చిన్నారుల నుంచి పెద్దల వరకు కొనుగోళ్లు చేస్తున్నారు. చిన్నారులను ఆకట్టుకునేలా కార్టూన్ బొమ్మలు, వివిధ డిజైన్లతో కూడిన రాఖీలు అందుబాటులో ఉన్నాయి. సంప్రదాయ రాఖీలతో పాటు ఆధునిక డిజైన్లకు కూడా డిమాండ్ కనిపిస్తోంది. సోదరీమణులు తమ సోదరుల అభిరుచులకు అనుగుణంగా రాఖీలను ఎంపిక చేసుకుంటున్నారు రాఖీలతో పాటు స్వీట్లు, చాక్లెట్లు, గిఫ్ట్ ప్యాక్‌ల కొనుగోళ్లు కూడా పెరిగాయి. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న సోదరులు, సోదరీమణులు పండుగ కోసం స్వగ్రామాలకు చేరుకుంటుండటంతో ఇళ్లలో సందడి నెలకొంది. ఉద్యోగాలు, విద్య, ఇతర కారణాలతో దూరంగా ఉన్న కుటుంబ సభ్యులు రాఖీ పండుగను కుటుంబంతో కలిసి జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.రాఖీ పండుగ కేవలం రాఖీ కట్టే వేడుక మాత్రమే కాకుండా సోదరసోదరీమణుల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసే ప్రత్యేక సందర్భంగా భావిస్తారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకోవడంతో పండుగకు మరింత ప్రత్యేకత సంతరించుకుంటుంది. అశ్వాపురంలో రేపటి రాఖీ వేడుకలకు ప్రజలు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు.

## ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి



**కొత్తగూడెం, ఆగస్టు 27, ప్రజా జ్యోతి :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన, దీర్ఘకాలిక డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్రవ్యాప్త ధర్నా పిలుపులో భాగంగా గురువారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాకు ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అలాంటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. 2వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత లేని సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. అలాగే పూర్తిస్థాయి ఉద్యోగుల ఆరోగ్య పథకం ఈహెచ్ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం చేపట్టే పోరాటాలకు సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సాబీర్ పాషా స్పష్టం చేశారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అండ

- 78 సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు సచివాలయంలో అందజేత



**దమ్మపేట, ఆగస్టు 27(ప్రజాజ్యోతి):** వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం కోరుతున్న బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అండగా నిలుస్తున్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అనారోగ్య బాధితుల నుంచి సేకరించిన 78 ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) దరఖాస్తులను గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయంలో సంబంధిత ప్రతినిధికి అందజేశారు. ఖరీదైన వైద్య చికిత్సలతో కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని అర్హులైన బాధితులకు ప్రభుత్వ సాయం అందేలా సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిరోజూ స్వీకరిస్తూ, వాటి ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికంగానే కాకుండా అవసరమైన సందర్భాల్లో ప్రభుత్వ కార్యాలయాల దృష్టికి స్వయంగా తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హులకు అందేలా తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు.

## వానాకాలం పంటలపై డిజిటల్ సర్వే

- రైతులు ఏఈఓలను సంప్రదించి పంటల నమోదు చేయించుకోవాలి
- మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి

**దమ్మపేట, ఆగస్టు 27(ప్రజాజ్యోతి):** వానాకాలంలో రైతులు సాగు చేస్తున్న పంటలు, సాగు విస్తీర్ణం, భూమి వివరాలను డిజిటల్ గా నమోదు చేసేందుకు వ్యవసాయ శాఖ డిజిటల్ పంటల సర్వే చేపట్టింది. ఈ నెల 20వ తేదీ నుంచి సర్వే ప్రారంభమైందని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో సర్వే వాలంటీర్ల ద్వారా పంటల వివరాలను నమోదు చేస్తుండగా, ఈ ప్రక్రియను వ్యవసాయ విస్తరణ అధికారులు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. రైతు పేరు, భూమి వివరాలు, సర్వే నంబరు, సాగు విస్తీర్ణం, పంట రకం, సాగు కాలం, నీటి వనరులు తదితర వివరాలను జీపీఎస్ ఆధారంగా నమోదు చేస్తారని తెలిపారు. వాస్తవంగా సాగులో ఉన్న పంటలపై కచ్చితమైన గణాంకాలు లభించడంతో పాటు ధాన్యం కొనుగోళ్లు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల అవసరాలను అంచనా వేయడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పంట నష్టం, బీమా, ప్రభుత్వ సహాయ చర్యల్లోనూ పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.

**ప్రత్యామ్నాయ పంటల రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి....**

ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో మినుము, పెసర, కంది, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయలు తదితర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. రైతులు తమ సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి డిజిటల్ పంటల సర్వే పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. పంట వివరాలు నమోదు చేసుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, పంట కొనుగోళ్లు, నష్టపరిహారం, ఇతర సహాయ కార్యక్రమాలకు వాస్తవ సాగు వివరాలు ఉపయోగపడతాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న సర్వేను వ్యవసాయ విస్తరణ అధికారులు వినోద్ కుమార్, అను బాబు పర్యవేక్షించారు. సర్వే వాలంటీర్లు పాల్గొనగా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు రవికుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



# మారేళ్లపాడు ప్రాజెక్టుపై మంత్రుల దృష్టి

- వేలాది ఎకరాలకు సాగునీరు అందించే పథకం పనుల పరిశీలనకు సన్నాహాలు..
- ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**అశ్వాపురం, అగస్ట్ 27,ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం లోని మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ప్రాంతంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు మంత్రులు పర్యటించనున్నారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ప్రాజెక్టు పనుల పురోగతి, నీటి సరఫరాకు సంబంధించిన అంశాలు, రైతులకు కలిగే ప్రయోజనాలపై మంత్రులు అధికారులతో సమీక్షించనున్న నేపథ్యంలో పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.మంత్రుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. పర్యటనలో మంత్రులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలను ముందుగానే పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా మంత్రుల హెలికాప్టర్ దిగేందుకు అనువైన ప్రదేశాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్, డీఎస్పీ, స్థానిక సీఐతో కలిసి పరిశీలించారు. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు స్థలం అనుకూలంగా ఉందా, భద్రతా పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సి ఉందా అనే అంశాలపై అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టారు.

**భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి....**

మంత్రుల పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. హెలికాప్టర్ దిగే ప్రాంతం చుట్టూ భద్రతా చర్యలు, వాహనాల రాకపోకలు, ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అవసరమైన నియంత్రణ చర్యలపై పోలీసు అధికారులు దృష్టి సారిస్తున్నారు. హెలికాప్టర్ ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులతో చర్చించారు.కలెక్టర్, డీఎస్పీ, సీఐలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తూ అవసరమైన ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, మంత్రుల పర్యటన సజావుగా జరిగేలా శాఖల మధ్య సమన్వయం ఉండాలని అధికారులు భావిస్తున్నారు.

**రైతులకు ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టు....**

మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ఈ ప్రాంత రైతులకు ఎంతో కీలకంగా మారనుంది. ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందుబాటులోకి వస్తే ప్రస్తుతం వర్షాధారంగా సాగు చేస్తున్న అనేక ప్రాంతాలకు నీటి సౌకర్యం మెరుగుపడే అవకాశం ఉంది. దీంతో రైతులు పంటల సాగులో స్థిరత్వాన్ని సాధించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి పెరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.సాగు నీటి సౌకర్యం పెరిగితే వరి, పత్తి, మిరప తదితర పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. నీటి లభ్యత పెరగడంతో రైతులకు సాగు వ్యయం తగ్గడంతో పాటు పంటలపై నమ్మకం పెరుగుతుందని స్థానిక రైతులు పేర్కొంటున్నారు.ప్రా జెక్టు పనులు పూర్తిస్థాయిలో అం దుబాటులోకి రావాలని వారు కోరుతున్నారు.

**పనుల పురోగతిపై మంత్రుల పరిశీలన.....**

మంత్రుల పర్యటనలో భాగంగా మారేళ్లపాడు ప్రాజెక్టు పనుల ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించే అవకాశం ఉంది. ప్రాజెక్టు నిర్మాణ పనులు, యంత్రాల పనితీరు, నీటిని ఎత్తిపోసే విధానం, పైపులైన్లు, కాలువలు, సంబంధిత మౌలిక వసతులపై అధికారులు వివరాలు అందించనున్నారు. పనుల్లో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించే అవకాశం ఉంది.ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయి రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, రైతులు కోరుతున్నారు. మంత్రుల పర్యటనతో ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన పనులకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని వారు ఆశిస్తున్నారు.

**ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే....**

మంత్రుల పర్యటన సందర్భంగా అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. హెలికాప్టర్ ల్యాండింగ్ స్థల పరిశీలనతో పాటు పర్యటన జరిగే ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు, పార్కింగ్, భద్రత, ప్రజల రాకపోకలు తదితర అంశాలపై అధికారులతో చర్చిస్తున్నారు. పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచిస్తున్నారు.మారేళ్లపాడు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందడం వల్ల నియోజకవర్గంలోని రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొంటున్నారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రుల పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.మొత్తం గా, మారేళ్లపాడు ప్రాజెక్టు పనులను మంత్రులు స్వయంగా పరిశీలించనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. హెలికాప్టర్ ల్యాండింగ్ స్థలం నుంచి భద్రతా ఏర్పాట్ల వరకు ప్రతి అంశాన్నిక్షుణ్ణంగా పరిశీలిస్తూ పర్యటనను విజయవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు త్వరగా పూర్తై రైతులకు అందుబాటులోకి రావాలని స్థానికులు, రైతులు ఆశిస్తున్నారు.

## దమ్మపేటలో ఎస్ఐఆర్‌పై గ్రామసభ

- అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు ఉండేలా చూడాలి

**దమ్మపేట, ఆగస్టు 27(ప్రజాజ్యోతి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, దమ్మపేట తహశీల్దార్ మద్దినేని మురళి, సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీఎల్ఓలు, ఆశా కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గత రెండు నెలలుగా ఎస్ఐఆర్‌లో భాగంగా బీఎల్ఓలు చేపట్టిన పనుల వివరాలను బీఎల్ఓల సూపర్‌వైజర్ జి.పి.ఓ. నరసింహారావు సమావేశంలో వివరించారు. ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన, తప్పుల సవరణ, అనర్హులు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి పేర్ల తొలగింపు, డబుల్ ఎంట్రీలు, ఒకరికి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉన్న అంశాలను పరిశీలించినట్లు తెలిపారు.

**కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం: డిప్యూటీ కలెక్టర్ మురళి**

ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్ మద్దినేని మురళి మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులు ఫారం–6 ద్వారా కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గ్రామంలో నివసిస్తూ ఫారం సమర్పించని కారణంగా అర్హులైన వారి పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగిపోయి ఉంటే, వారు తిరిగి ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. తొలగించిన ఓట్ల వివరాలను పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచుతున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరితే వాటి జిరాక్స్ ప్రతులు అందిస్తామని తెలిపారు. గ్రామసభకు హాజరుకాని బీఎల్ఓపై షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఓటు హక్కు కాపాడుకోవడం అందరి బాధ్యత: సర్పంచ్ రమాదేవి**

సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత బీఎల్ఓలు, అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలందరిపైనా ఉందన్నారు. దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా సుమారు 1,500 ఓట్లు తొలగించబడ్డాయని తెలిపారు. ప్రజలు తమ ఓటు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన ఫారాలను సమర్పించి ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు. వీధుల వారీగా, ఇంటి క్రమంలో ఓటర్ల జాబితాను రూపొందించాలని పలువురు కోరారని, గత పంచాయతీ ఎన్నికల సమయంలో ఒకే ఇంటికి చెందిన ఓట్లు వేర్వేరు వార్డుల్లో ఉండటం, కొందరి పేర్లు డబుల్‌గా నమోదవడంతో ఇబ్బందులు ఎదురైనందున ఈ సమస్యలను సరిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు.ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ దమ్మపేట పంచాయతీ పరిధిలోని ఏడు పోలింగ్ బూత్‌లలో ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఓలు చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కార్యదర్శి కొల్లు దుర్గారావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్‌గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, ఉయ్యాల లక్ష్మీనారాయణ, ధర్మసోతు పద్మ, రావు గంగాధరరావు, చిన్నశెట్టి యుగంధర్, పాకనాటి శ్రీను, పసుమర్తి మల్లికార్జునరావు, దాసరోజు రామబ్రహ్మం, తాళ్ల శంకర్, షేక్ గోరె, కారుమూరి సతీష్, అన్నవరపు నాగేంద్రరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## టీచర్ కోసం విద్యార్థుల ధర్నా



**చర్ల, ఆగస్టు 27: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలం కుర్నపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం రహదారిపై ధర్నా నిర్వహించారు. సుమారు మూడు గంటల పాటు ఆందోళన కొనసాగింది.కుర్నపల్లి పాఠశాలలో సుమారు 120 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా, ప్రస్తుతం ఐదు గురు ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తల్లిదండ్రులు తెలిపారు. గత రెండేళ్లుగా పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే సోషల్ టీచర్‌ను డిప్యూటేషన్‌పై మరో పాఠశాలకు పంపించారని తెలిపారు.ఉపాధ్యాయుల కొరత సమస్యను పరిష్కరించాలని మండల విద్యాశాఖ అధికారికి పలుమార్లు విన్నవించినప్పటికీ స్పందన లేకపోవడంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా "మా టీచర్ మాకే కావాలి" అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.విషయం తెలుసుకున్న పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ధర్నా ప్రదేశానికి చేరుకుని, మండల విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు సోమవారం పాఠశాలకు ఉపాధ్యాయురాలిని నియమిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు, గ్రామస్తులు ధర్నాను విరమించారు.డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయురాలిని తక్షణమే కుర్నపల్లి పాఠశాలలో తిరిగి నియమించాలని, విద్యార్థుల విద్యకు ఇబ్బందులు కలగకుండా ఉపాధ్యాయుల కొరతను వెంటనే పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరారు. సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి, పాఠశాల చైర్మన్ సత్యవతి, గొంది సుధాకర్‌రావు, ఇర్పా ముత్తయ్య, చందు, వాగే జానికమ్మ, రామక్క, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

## కులమతాలకు అతీతంగా అల్లుకున్న అనురాగ బంధం: 'రక్షాబంధన్'

**అశ్వారావుపేట (ప్రజాజ్యోతి, ఆగస్టు 27:** కాల చక్రపు గమనంలో శ్రావణ పౌర్ణమి రాత్రి కురిసే వెన్నెల ఎంత సహజ సుందరమైనదో, రాఖీ పౌర్ణమి ప్రపంచానికి ఇచ్చే అనురాగ సందేశం కూడా అంతటి విశ్వజనీనమైనది. రక్షాబంధన్ అంటే కేవలం ఒక రోజు జరుపుకునే నియమబద్ధమైన పండుగ కాదు; అది మానవత్వపు నిశ్శబ్ద తరంగం, ఆత్మల నడుమ అల్లుకునే దివ్యమైన అనుబంధం. రక్త సంబంధాలు శరీరాన్ని మాత్రమే కలుపుతాయేమో కానీ, హృదయ స్పందనలు కలుపుకునే చోట పుట్టే ప్రేమ కులాల సరిహద్దులను, మతాల ప్రాకారాలను పటాపంచలు చేస్తుంది. శతాబ్దాల నుంచి భారతీయ సంస్కృతిలోని విశాలత్వానికి సాక్ష్యంగా నిలిచిన ఈ ఉత్సవం, శ్రీకృష్ణుడి అభయహస్తం నుండి ద్రౌపది చూపిన నిష్కామ ప్రేమ వరకు ఎదిగిన పవిత్ర సంకేతం. తన వేలి నుండి కారే రక్తాన్ని చూసి కంగారుపడి ద్రౌపది కట్టిన కొంగు ముక్కను, పరమాత్మ అక్షయ వస్త్రాల అభయాభూషణంగా మార్చిన క్షణంలోనే, ఆ చిన్న దారపు పోగు ఈ భూమిపై ఉన్న ప్రతి స్త్రీ ఆత్మగౌరవానికి, ప్రశాంతతకు రక్షణ కవచంగా రూపాంతరం చెందింది.ఈ పట్టునూలు పోగుకు ఎలాంటి వర్ణభేదాలు లేవు; అది శ్వేతవర్ణపు పవిత్ర మనసులకు, స్నేహమనే నిత్యత్వానికి సంకేతం. ఇతిహాసాల సరిహద్దులు దాటి చరిత్ర పుటలను తిరగేస్తే, మేవార్ రాణి కర్ణావతి తన రాజ్యాన్ని కాపాడుకోవడానికి మొఘల్ చక్రవర్తి హుమాయూన్‌కు రాఖీ పంపిన ఘట్టం, మతాల ఆంక్షలను తుడిచిపెట్టి సోదర భావానికి పట్టం కట్టింది. రాజకీయ శత్రుత్వాలను, మతాంతర వ్యత్యాసాలను మరిచిపోయి ఆ రక్షాసూత్రాన్ని శిరసావహించిన హుమాయూన్ చర్య——రాఖీ అనేది కేవలం ఒక నిర్దిష్ట సమూహానికి చెందిన సంప్రదాయం కాదని, అది మానవత్వాన్ని ఏకం చేసే మహోన్నతమైన విశ్వప్రేమ భాష అని చాటిచెప్పింది. హిందూ, ముస్లిం, సిక్కు, ఈసాయి అనే తారతమ్యాలు లేక, ధనిక–పేద అనే అంతరాలు లేకుండా, ఒకరి రక్షణకు మరొకరు నిలబడతామని ఇచ్చే ఆత్మీయ అభయమే ఈ రక్షాబంధన్.ఒకరి శ్రేయస్సును కోరుతూ పవిత్రమైన మనసుతో కట్టే ఆ దారం, జీవితంలో ఎదురయ్యే ఏ తుఫాను నుంచైనా కాపాడే ఒక మానసిక ద్వీపం. ఇందులో ఏ స్వార్థం లేదు, ఏ లౌకిక ఆపేక్ష లేదు; ఉన్నదల్లా ఆజన్మాంతం తోడుంటాననే మౌన వాగ్దానం, సుదూర తీరాల్లో ఉన్నా ఒకరికోసం ఒకరు తపించే అనురాగ స్పందన. కులాలకు అతీతంగా, మతాలకు దూరంగా, కేవలం "మనుషులం... ఒకరికొకరం రక్షకులం" అనే పరమ సత్యాన్ని చాటిచెప్పే రక్షాబంధన్, కాలంతో పాటు చెరిగిపోని ఒక దివ్యమైన భావన. ఆత్మీయతల దీపాలు వెలిగించే ఈ మహోత్సవం, మన మూలాలను గుర్తుచేస్తూ విశ్వమానవ సౌభ్రాతృత్వానికి నిత్యం వెలిగే పవిత్ర జ్యోతిగా నిలిచిపోతుంది.

## అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని... ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను మోసం చేసే వారిని సహించేది లేదు

- **జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ హెచ్చరిక**



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 27, ప్రజా జ్యోతి**

పేద ప్రజల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని మోసగిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ హెచ్చరించారు, అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించని పక్షంలో ప్రజలను బెదిరించడం, వేధింపులకు గురి చేయడం వంటి చర్యలకు పాల్పడే వ్యక్తులపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు ప్రజలు తమ ఆర్థిక అవసరాల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు ,రుణం తీసుకునే ముందు వడ్డీ చెల్లింపు విధానం వివరాలను ముందుగా తెలుసుకోవాలని తెలిపారు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగ యువతను ప్రలోభాలకు గురిచేసి వారి నుంచి డబ్బులు వసూలు చేసే మోసగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు, ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మాయ మాటలు చెప్తూ డబ్బులు వసూలు చేసే వ్యక్తుల మాటలు నమ్మరాదని, ఉద్యోగాల కోసం ఎటువంటి ముందస్తు చెల్లింపు చేయరాదని సూచించారు, ఉద్యోగాలకు సంబంధించిన వివరాలను సంబంధిత సంస్థల అధికారిక మార్గాల ద్వారా నిర్ధారించుకోవాలని, అదేవిధంగా ఉద్యోగాలు ఇతర ఆర్థిక ప్రయోజనాల పేరుతో వచ్చే అనుమానస్పద ఫోన్ కాల్స్ ,మెసేజ్లు, సోషల్ మీడియా ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చిన తర్వాత దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉద్యోగం ఇప్పిస్తామంటూ ముందుగా డబ్బులు చెల్లించాలని తమ వద్దకు వస్తే దగ్గరలో ఉన్న పోలీస్ అధికారులకు తెలియజేయాలని కోరారు, ఉద్యోగాల నియామకంపై ప్రభుత్వం చూపిన విధంగా నియామక ప్రక్రియ జరుగుతుందని పెట్టి పరిస్థితుల్లో మోసగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు చెల్లించి మోసపోరాదని కోరారు.

## గడప గడపకు తెలంగాణ రక్షణ సేన మేనిఫెస్టో



**దమ్మపేట, ఆగస్టు 27(ప్రజాజ్యోతి):** తెలంగాణ రక్షణ సేన అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సోడెం వెంకట్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణసేన మేనిఫెస్టోను గడప గడపకు తీసుకెళ్లే కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా మల్లారం, వైబీఆర్‌నగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజలను కలుసుకున్నారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలు, ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని, రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అలాగే కవిత ప్రవేశపెట్టినట్లు పేర్కొంటున్న 'భూ లక్ష్మి' పథకం గురించి ప్రజలకు వివరించి, దాని ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు సరైన సమాచారం అందించడంతో పాటు మేనిఫెస్టోలోని అంశాలు ప్రతి కుటుంబానికి చేరేలా గడప గడపకు ప్రచారం నిర్వహిస్తున్నామని సోడెం వెంకట్ తెలిపారు. కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసుల చర్యలు



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 27,(ప్రజా జ్యోతి )** కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్న ఇద్దరిని గురువారం పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు, గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారిపై చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి పోలీసులు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు, మత్తు పదార్థాల వినియోగం నుంచి బయటపడేలా సాధారణ జీవన విధానంలోకి తీసుకురావాలన్న మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఇద్దరిని డి_ అడిక్షన్ సెంటర్కు తరలించినట్లు ఎస్ హెచ్ ఓ తెలిపారు.

## సిరివెలుగుల శ్రావణం... లక్ష్మీ కరుణా స్రవంతి!




**అశ్వారావుపేట (ప్రజాజ్యోతి, ఆగస్టు 27** ప్రకృతి పరవశించి పచ్చని పట్టుచీర కట్టుకున్న వేళ, గగనం నుండి పడే చినుకుల ముత్యాల జల్లులు నేలను తాకే వేళ... హిందూ సనాతన ధర్మంలో ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతూ అడుగుపెడుతుంది శ్రావణ మాసం. ఈ కాలం కేవలం క్యాలెండర్‌లో ఒక మాసం మాత్రమే కాదు, జీవాత్మను పరమాత్మతో అనుసంధానించే ఒక పవిత్ర సంకీర్తన. నింగి, నేల, మానవ మనస్సు... సమస్తం దైవత్వంతో పులకించిపోయే ఈ పుణ్యకాలంలో, ఇళ్ల ముందు పరిచే రంగవల్లులు, ద్వారాలకు ముస్తాబయ్యే మామిడి తోరణాలు అష్టలక్ష్ముల ఆగమనానికి స్వాగత తోరణాలుగా మారతాయి. ఆ శ్రావణ పవనాలు తెచ్చే ప్రశాంతతలో, ప్రత్యేకించి శ్రావణ శుక్రవారం ఒక దివ్య నక్షత్రంలా మెరిసిపోతూ, లక్ష్మీదేవి కరుణాకటాక్షాలను భువికి మోసుకొస్తుంది. సముద్ర మథనం నాటి క్షీరసాగరపు అలల రాగాల మధ్య నుండి ఉదయించిన సిరుల తల్లి, తన భక్తుల ఇళ్లను భోగభాగ్యాలతో నింపడానికి ఎంచుకున్న మహోజ్వల దినమది. చారుమతి దేవి నిండైన భక్తికి మెచ్చి సాక్షాత్కరించిన ఆ అభయ వరప్రదాయిని, తరతరాల సుమంగళి తత్వానికి ప్రాణప్రతిష్ట చేసింది. శుక్రవారపు తొలి సంధ్యవేళలో పసుపు, కుంకుమల సువాసనలు ఇల్లంతా వ్యాపిస్తుంటే, బియ్యపు పిండితో అలంకరించిన కలశంపై శోభిల్లే కొబ్బరికాయ, పద్మరాగాల కాంతులీనే అమ్మవారి రూపం ప్రతి ఇంటా ఒక స్వర్గీయ వాతావరణాన్ని ఆవిష్కరిస్తుంది. తొమ్మిది పోగుల తోరాన్ని చేతికి ధరించి, నిష్ఠతో సమర్పించే పరమాన్నాలు, పిండివంటల నైవేద్యాలు భౌతిక నివేదనలను సైతం ఆధ్యాత్మిక ఆనందంగా మారుస్తాయి. ఈ శ్రావణ శుక్రవారపు ఆరాధనా ఫలం కేవలం భౌతిక సంపదను మాత్రమే కాక, మనసులకు ప్రశాంతతను, గృహానికి ఆయురారోగ్యాలను ప్రసాదిస్తుంది. ముత్తైదువులు ఒకరికొకరు ఇచ్చుకునే తాంబూలంలో ఒక దివ్యమైన శుభ కాంక్ష దాగి ఉంటే, అత్త నుంచి కోడలికి, తల్లి నుంచి కూతురికి అందివచ్చే ఈ పసుపు–కుంకుమల వారసత్వంలో మన సంస్కృతి యుగయుగాలుగా నిరంతరాయంగా జీవిస్తోంది. దారిద్ర్య దుఃఖాలను పటాపంచలు చేస్తూ, సకల ఐశ్వర్యాలను నింపే ఈ పూజా విధానం, మారుతున్న కాలంలోనూ చెక్కుచెదరని విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. తరతరాల నుండి నేటి ఆధునిక జీవన స్రవంతి వరకు, బాహ్య రూపాలు మారినా భక్తి భావం మారక, హృదయాలను పవిత్రీకరించే ఈ శ్రావణ శుక్రవారపు వెలుగులు... ప్రతి ఇంటా సౌభాగ్యపు కాంతులను, మనస్సుల్లో అఖండ శాంతిని నింపుతూ ఒక నిరంతర దివ్య ప్రవాహమై సాగిపోతున్నాయి.

- ముసుగు వీడిన 'బడా మనుషుల' బినామీ ముఖాలు..
- సమాజంలో గౌరవం, వెనుక కోట్ల దందా!
- సేల్ డీడ్ లేకున్నా 'అబ్సల్యూట్ ఓనర్' అవతారం..
- 11,173 గజాల స్థలంపై కొత్తపల్లి కుటుంబం పట్టు!
- కిన్నెరలో ఆరుగురు.. నలుగురు రూట్‌వెల్‌లోకి..
- ఒకే కుటుంబం చేతుల్లో పారిశ్రామిక సామ్రాజ్యం!
- ఈఓటి పెనాల్టీ రూ. 2.5–3 కోట్లు.. బ్యాంకు రుణం రూ. 3.75 కోట్లు.. భూమి విలువ మరో రూ. 17 కోట్లు!
- సభ్య సమాజంలో పెద్ద మనుషుల అవతారాలపై సమగ్ర విచారణకు డిమాండ్!

# రూ. 100 బాండ్‌తో.. రూ. 23 కోట్ల స్కామ్‌కు స్కెచ్!

సమాజంలో హోదా, తెల్ల చొక్కాలు, పెద్ద మనుషుల ముసుగులు వేసుకుని చలామణి అవుతున్న 'బడా బాబుల' అసలు స్వరూపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. పైకి గౌరవనీయ పారిశ్రామికవేత్తలమని చెప్పుకుంటూనే, వెనుక ప్రభుత్వ సొత్తును అక్రమ మార్గాల్లో స్వాహా చేసేందుకు పక్కా వ్యూహం రచించారు. కొత్తగూడెం పారిశ్రామిక వాడలోని ప్లాట్ నంబర్ 17 (11,173 చదరపు గజాలు) లో వీరు ఆడిన బినామీ నాటకం.. కేవలం వంద రూపాయల బాండ్ పేపర్‌తో మొదలై ఏకంగా రూ. 23 కోట్లకువరకు దిగమింగే దిగ్భ్రాంతికర దోపిడీగా మారింది. ● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి


एक सौ रुपये Rs. 100 रु. 100 ONE HUNDRED RUPEE

भारत INDIA

INDIA NON JUDICIAL

తెలంగాణ तेलंगाना TELANGANA

RENTAL AGREEMENT

THIS RENTAL AGREEMENT is made and executed on this 31st day of January 2024, at Hyderabad between M/s.KINNERA MARBLES PRIVATE LIMITED represented by its Director Mr. RAMCHANDRAIAH SURNAPAKA presently Resident of PLOT NO-17, CHUNCHUPALLY, SRI RAMANJANEYA NAGAR COLONY, KOTHAGUDEM, TELANGANA 507101 the First Party, which expression shall mean and include his legal heirs, executor's administrators, and assignees, hereinafter called THE LESSOR.

AND

M/s ROOTWELL AGRO VET PRIVATE LIMITED represented by its Director Mr. NARASIMHARAO KOTHAPALLI presently Resident of H No: 3-1-136/1, Hanuman Basthi, Kothagudem, Khammam, Andhra Pradesh Telangana, India. 507101- herein after called the LESSEE.

WHEREAS, the Lessor is the absolute owner of the schedule mentioned property and got marketable title to the same.

Whereas the Lessee herein approved by the Lessor to lease out the schedule mentioned property located at PLOT NO-17, CHUNCHUPALLY, SRI RAMANJANEYA NAGAR COLONY, KOTHAGUDEM, TELANGANA - 507101 For running commercial activities, and the Lessor and lessee agreed for the following conditions stipulated hereunder.

"ATTESTED"

### »» రూ. 100 బాండ్‌తో.. 'అబ్సల్యూట్ ఓనర్' నాటకం!

1990లో అప్పటి ఏపీఐఐసీ ద్వారా కిన్నెర మార్బుల్స్‌కు ఈ స్థలం కేటాయించినప్పుడు రికార్డుల్లో శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిల పేర్లు ఉండేవి. ఏజెన్సీ పరిధిలో 1/70 చట్టం అమలులో ఉండటంతో గిరిజనేతర సంస్థ అయిన కిన్నెరకు ఎలాంటి సేల్ డీడ్ చెల్లలేదు. 1995లోనే ఈ పరిశ్రమ మూతపడి 25 ఏళ్ల పాటు నిరుపయోగంగా ఉంది. అయితే, ఈ విలువైన భూమిపై కన్నేసిన కొత్తపల్లి కుటుంబీకులు 2020లో లీగల్ లొసుగుల ముసుగులో కోర్టును ఆశ్రయించి, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసీ) రికార్డుల్లో నరసింహారావు కొత్తపల్లి, సీతామహాలక్ష్మి, రామచైతన్య, నాగమౌనికల పేర్లతో బోర్డు మార్చేశారు. చట్టబద్ధమైన రిజిస్ట్రేషనే లేని స్థలానికి సూరపాక రామచంద్రయ్య అనే వ్యక్తిని 'అబ్సల్యూట్ ఓనర్' (సంపూర్ణ యజమాని)గా నిలబెట్టి, కేవలం రూ. 100 నాన్ జ్యుడీషియల్ బాండ్ పేపర్‌పై రూట్‌వెల్ కంపెనీకి ప్రైవేట్ రెంటల్ అగ్రిమెంట్ రాసుకోవడం ఈ ప్లాన్‌లో కీలక ఘట్టం.

### »» ముసుగులో బినామీ రాచరికం..

ఇక అలా కిన్నెర మార్బుల్స్‌లో ప్రవేశించిన ఆరుగురు డైరెక్టర్లలో, నలుగురు ఒకే కుటుంబానికి చెందినవారు కావడమే కాక, వారే రూట్‌వెల్ ఆగ్రో వెట్ సంస్థను కూడా శాసిస్తున్నారు. టీజీఐఐసీ అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని వీరు రెండు సంస్థల ముసుగులో బినామీ రాచరికం నడిపారు. అసలు వాస్తవానికి వీళ్ళకు ఆ స్థలానికి, కిన్నెర కంపెనీకి ఎలాంటి అధికారిక సంభందం లేదు. దాంతోపాటు ఏ రకమైన సేల్ డీడ్ గానీ, సబ్‌లీజు అనుమతులు గానీ లేవని అధికారులు స్పష్టం చేసినా.. అయిన అదే రూ. 100 బాండ్ ఆధారంగా ఏకంగా రూ. 3.75 కోట్ల బ్యాంకు రుణం గుంజేశారు. సామాన్యుడికి రూపాయి రుణం ఇవ్వడానికి వందల కాగితాలు అడిగే బ్యాంకర్లు, ఈ 'బడా బాబుల' ముసుగు చూసి ఏ పత్రాలు లేకుండా కోట్ల ప్రజాధనాన్ని ఎలా కట్టబెట్టారో సమాధానం చెప్పాల్సి ఉంది. దీంతో ఈ అంశం పై బ్యాంకు అధికారుల పాత్ర కూడా బహిరంగ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## 'పెద్ద మనుషుల' రూ. 23 కోట్ల స్కామ్ లెక్క ఇదిగో!

చుంచుపల్లి ప్లాట్ నంబర్ 17లోని 11,173 చదరపు గజాల స్థలానికి ప్రస్తుత బహిరంగ మార్కెట్ ప్రకారం భూమి విలువే దాదాపు రూ. 17కోట్లకు పైగా ఉంది. ఈ స్థలానికి సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్ గానీ సేల్ డీడ్ గానీ లేకుండానే ప్రైవేట్ బాండ్ ఆధారంగా పొందిన బ్యాంక్ రుణం రూ. 3.75 కోట్లకు చేరింది. దీనికి తోడు 25 ఏళ్ల పాటు పరిశ్రమను మూసేసినందుకు చెల్లించాల్సిన 'ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ పెనాల్టీ' (ఈఓటి) పెనాల్టీ రూ. 2.5 కోట్ల నుండి రూ. 3 కోట్ల వరకు పేరుకుపోవడంతో మొత్తం స్కామ్ విస్తృతి రూ. 23 కోట్లకు పైగా మారింది. వంద రూపాయల కాగితంతో కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని ఆక్రమించే తెగింపునకు ఈ 'కొత్తపల్లి నరసింహారావు' ఫ్యామిలీ ఒడిగట్టారనే నిజం ఇక్కడ సుస్పష్టమవుతోంది.

### »» బడా బాబుల అక్రమాలపై క్రిమినల్ విచారణ జరగాలి!

పెద్ద మనుషుల రూపంలో సాగుతున్న ఇలాంటి అవినీతి మూలాలను తొక్కిపెడితేనే పారిశ్రామిక రంగానికి, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ ఉంటుంది. ప్రజాధనాన్ని, ప్రభుత్వ భూములను తమ జేబు సంస్థలుగా మార్చుకున్న ఈ వ్యక్తులపై జిల్లా కలెక్టర్ తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. ప్లాట్ నంబర్ 17 ప్రాంగణాన్ని తక్షణమే సీజ్ (Seize) చేయడంతో పాటు, తప్పుడు బాండ్లతో కోట్ల రూపాయల రుణాలు పొంది బ్యాంకులను, ప్రభుత్వాన్ని మోసగించిన ఈ బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని పారిశ్రామిక వర్గాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## పాల్వంచలో మూడు కేజీల గంజాయి పట్టివేత

కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 27, (ప్రజా జ్యోతి) గుట్టు చప్పుడుగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం రాత్రి పాల్వంచ పోలీసులు పట్టుకున్నారు, వివరాలు ఎలా ఉన్నాయి, సూర్యాపేట జిల్లాకు చెందిన జోసెఫ్, శ్రీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు ఒరిస్సాలో మూడు కేజీల గంజాయిని కొనుగోలు చేసి తమ ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం వెళుతుండగా పాత పాల్వంచలోని మహాలక్ష్మి అమ్మ వారి టెంపుల్ వద్ద పోలీసులు పట్టుకొని విచారణ అనంతరం స్టేషన్కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఖేలో ఇండియా సంవాద్ నిర్వహణ

- విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి
- కళాశాల ప్రిన్సిపల్ పి పద్మ

కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 27, (ప్రజా జ్యోతి) స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖేలో ఇండియా సంవాద్ – మై భారత్, నేషనల్ స్పోర్ట్స్ డే–2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగాన్ని విద్యార్థులు, అధ్యాపకులు ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి, ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ డా.వేముల కామేశ్వరరావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ పొట్లపూవు శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వి.వంశీ, ఎం.విక్రాంత్‌తో పాటు ఖేలో ఇండియా ఆర్చరీ కోచ్ టి.కళ్యాణ్‌ను ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ మాట్లాడుతూ యువత క్రీడల్లో మరింతగా రాణించి, భారతదేశం ఒలింపిక్స్‌తో పాటు అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని పతకాలు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 'నషా ముక్త్ యువ–వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' ప్రతిజ్ఞను డా.వేముల కామేశ్వరరావు చేయించారు

